క్లుప్తంగా

దేశాభివృద్ధిలో మహిళల పాత్ర కీలకం

శేరిలింగంపల్లి: దేశాభివృద్ధిలో మహిళల పాత్ర కీలకమైందని జలశక్తి అవార్డు గ్రహీత కల్పనా రమేష్ అన్నారు. జీహెచ్ఎంసీ శేరిలింగంపల్లి సర్కిల్‌లో శనివారం నిర్వహించిన మహిళా దినోత్సవ వారోత్సవాల్లో ఆమె ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ మహిళలు చైతన్యవంతం కావాలని, అన్ని రంగాల్లో రాణించాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో సర్కిల్ ఉప వైద్యాధికారి డాక్టర్ నగేష్ నాయక్, శానిటరీ సూపర్‌వైజర్ జలంధర్‌రెడ్డి, చందానగర్ ప్రాజెక్టు ఆఫీసర్ ఉషారాణి తదితరులు పాల్గొన్నారు.

ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికల ఏర్పాట్ల పరిశీలన

శేరిలింగంపల్లి: శేరిలింగంపల్లిలో టీచర్ ఎమ్మెల్సీ ఎన్నికలకు సంబంధించి భద్రతా ఏర్పాట్లను మాదాపూర్ డీసీపీ శిల్పవల్లి శనివారం పరిశీలించారు. స్థానిక జిల్లా పరిషత్ హైస్కూల్‌లో ఈ నెల 13 నిర్వహించనున్న టీచర్ ఎమ్మెల్సీ ఎన్నికల ఏర్పాట్లపై చందానగర్ ఇన్‌స్పెక్టర్ క్యాస్ట్రోరెడ్డితో కలిసి పరిశీలించారు. బందోబస్తు, పెట్రోలింగ్ తదితర ఏర్పాట్లపై పలు సూచనలు చేశారు. కార్యక్రమంలో ఎస్ఐ శ్రీధర్ తదితరులు పాల్గొన్నారు.



ఎన్నికల ఏర్పాట్లపై ఇన్‌స్పెక్టర్‌తో చర్చిస్తున్న మాదాపూర్ డీసీపీ శిల్పవల్లి





‘ప్రాచీన’ సందడి

ప్రాచీన సాంస్కృతిక వారసత్వాన్ని చాటిన శ్రీరామ్ యూనివర్సల్ స్కూల్




రాయదుర్గం: స్వదేశీ సంప్రదాయ వస్త్రధారణ, భారతీయ వంటకాలు, స్థానికమైన ఆటలు, అద్భుతమైన భారతీయ సంస్కృతి వారసత్వాన్ని చాటే కార్యక్రమాలతో విద్యార్థులు అలరించారు. నానక్‌రాంగూడలోని శ్రీరామ్ యూనివర్సల్ స్కూల్ పాఠశాల ప్రాంగణాన్ని శనివారం భారతీయ పట్టణాలు, గ్రామాల సూక్ష్మరూపంగా మార్చేశారు. భారతీయ సంస్కృతిక వైభవాన్ని చాటిచెప్పేలా విద్యార్థులు విభిన్న వేషధారణలతో సందడి చేశారు. ముఖ్య అతిథులుగా హాజరైన ఐడీఈఎస్ అధికారిణి సుజాత, ప్రముఖ శిల్పి ఎల్ఎస్ రామస్వామి విద్యార్థులను అభినందించారు. ఈ సందర్భంగా నిర్వహించిన సంస్కృతిక కార్యక్రమాలతోపాటు శాండ్ ఆర్ట్, సాంప్రదాయ నృత్యాలైన కత్‌పుల్లీ, బృంద ప్రదర్శన అందరినీ అలరించాయి. తోలుబొమ్మలాటను ప్రదర్శించారు. దీంతోపాటు ‘శ్రీటిస్’లు పేరిట నుక్కడ్ నాటకం, ఫ్లాష్‌మాబ్‌తో అందరినీ ఆకట్టుకుంది. సంప్రదాయ దుస్తుల వేషధారణ, అల్లికల ప్రదర్శన నిర్వహించారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ డాక్టర్ జ్యోతిరెడ్డి, పలువురు ఉపాధ్యాయులు, తల్లిదండ్రులు, సందర్శకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

మౌలిక వసతుల కల్పనకు కృషి



సుభాష్‌చంద్రబోస్ కాలనీలో పర్యటిస్తున్న ఎంపీ రంజిత్‌రెడ్డి, ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే ఆరికెపూడి గాంధీ

హఫీజ్‌పేట్ : మాదాపూర్ డివిజన్ పరిధిలో నెలకొన్న సమస్యల పరిష్కారం, చేపట్టాల్సిన అభివృద్ధి పనులపై పాదయాత్ర నిర్వహిస్తున్నట్లు చేవెళ్ల పార్లమెంట్ సభ్యులు రంజిత్‌రెడ్డి అన్నారు. శనివారం డివిజన్ పరిధిలోని ఆదిత్యనగర్, సుభాష్‌చంద్రబోస్ కాలనీ, ఇజ్జత్‌నగర్ వీకర్ సెక్షన్, భిక్షపతినగర్ ప్రాంతాల్లో ఆయన ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే ఆరికెపూడి గాంధీతో కలిసి పాదయాత్ర నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ నియోజకవర్గ పరిధిలో మౌలిక వసతుల కల్పనకు చర్యలు తీసుకుంటామన్నారు. ప్రతి డివిజన్‌ను సమగ్ర అభివృద్ధి చేస్తామని, దశల వారీగా అభివృద్ధి పనులు చేపడతామని పేర్కొన్నారు. అసంపూర్తిగా మిగిలిన పనులను త్వరలోనే పూర్తి చేస్తామన్నారు. డివిజన్ పరిధిలోని ప్రతి బస్తీలో ఇంటింటికి వెళ్లి ప్రజల సమస్యలను తెలుసుకుంటున్నట్లు తెలిపారు. ప్రజలందరూ కాలనీలు, బస్తీల అభివృద్ధిలో భాగస్వాములు కావాలన్నారు. అనంతరం అంగన్వాడీ కేంద్రాన్ని సందర్శించి పిల్లలకు అందుతున్న పౌష్టికాహారం, విద్య తదితర అంశాలను అడిగి తెలుసుకున్నారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ నాయకులు శ్రీనివాస్ యాదవ్, శ్రీనివాస్ గౌడ్, సాంబశివరావు, రఘునాథ్, గుమ్మడి శ్రీనివాస్, శ్యామ్, అనిల్ కుమార్ కావూరి, మునాఫ్ ఖాన్, కృష్ణ యాదవ్, ముక్తార్, రహీం పటేల్, బుజమ్మ, పర్వీన్, శ్రీనివాస్, ఖాసీం లియకత్, బాబుమియా, సలీం, శశిరేఖ, శ్రీజ రెడ్డి, లక్ష్మీ తదితరులు పాల్గొన్నారు.

శిల్పకళా వేదికలో అవని అరంగేట్రం



అవని ఉపాసన కశ్యప్ నృత్య ప్రదర్శన

మాదాపూర్: వీనసొంపైన సంగీతానికి కనువిందు చేసే భరతనాట్య అరంగేట్ర నృత్య ప్రదర్శనలతో అవని ఉపాసన కశ్యప్ ఆద్యంతం అలరించింది. మాదాపూర్‌లోని శిల్పకళావేదికలో శనివారం భరతనాట్య గురువు సంతోష్‌కుమార్ తమాంగ్, ప్రముఖ నాట్య కళాకారులు డాక్టర్ మైథిలి మరట్టా అనూప్, డాక్టర్ కిరమ్ బోనాల , ప్రొఫెసర్ జే బాలసుబ్రమణ్యన్ సమక్షంలో అవని ఉపాసన అరంగేట్ర ప్రదర్శన సందర్శకులను అలరించింది. జతిస్వరం, శబ్దం, పదవర్ణం, దేవర్ణం, కీర్తణం, క్రితి, తిల్లాన, మంగళం తదితర అంశాలను ప్రదర్శించారు.

‘టై ఉమెన్ 2023’ 4వ ఎడిషన్ ప్రారంభం



హైటెక్స్‌లో టై ఉమెన్ 2023 4వ ఎడిషన్‌ను ప్రారంభిస్తున్న జెన్నిఫర్ లార్సన్, శోభనా కామినేని తదితరులు

మాదాపూర్: మహిళల యాజమాన్యంలోని వ్యాపారాలు నెమ్మదిగా అభివృద్ధి చెందుతాయని యుఎస్ కాన్సులేట్ జనరల్ ఎంఎస్ జెన్నిఫర్ లార్సన్ అన్నారు. మాదాపూర్‌లోని హైటెక్స్‌లో నిర్వహిస్తున్న బిజినెస్ ఉమెన్ ఎక్స్‌పో 2023లో భాగంగా శనివారం టై ఉమెన్ 2023 4వ ఎడిషన్‌ను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ రాష్ట్రానికి చెందిన మహిళా పారిశ్రామిక వేత్తలను ప్రోత్సహించేందుకు, ప్రపంచవ్యాప్తంగా బోల్డ్ అండ్ ఇంపాక్ట్‌ఫుల్ ప్రత్యేకమైన టై ఉమెన్ బ్రాండ్‌ను ముందుకు తీసుకువెళ్లేందుకు ఈ కార్యక్రమాన్ని ఏర్పాటు చేసినట్లు తెలిపారు. వ్యాపారాన్ని హాబీగా తీసుకోవద్దని మహిళా పారిశ్రామిక వేత్తలకు ఆమె సూచించారు. మిడిల్ మేనేజ్‌మెంట్ స్థాయిలో భారతదేశంలో 36శాతం సిబ్బంది మహిళలేనని అపోలో హస్పిటల్ ఎగ్జిక్యూటివ్ వైస్ చైర్ పర్సన్ శోభనా కామినేని అన్నారు. కార్యక్రమంలో పలువురు మహిళా పారిశ్రామిక వేత్తలు తదితరులు పాల్గొన్నారు.

మహిళాభ్యున్నతితోనే సమాజాభివృద్ధి

జేఎన్‌టీయూ ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ అస్కని జయలక్ష్మి



తెలంగాణ సగర సంఘం ఆధ్వర్యంలో మహిళలను సత్కరిస్తున్న దృశ్యం

గచ్చిబౌలి: మహిళలు అన్ని రంగాల్లో రాణించినప్పుడే సమాజం అభివృద్ధి చెందుతుందని జేఎన్‌టీయూ ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ అస్కని జయలక్ష్మి అన్నారు. శనివారం గచ్చిబౌలిలోని సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో తెలంగాణ సగర మహిళా సంఘం రాష్ట్ర కమిటీ ఆధ్వర్యంలో నిర్వహించిన అంతర్జాతీయ మహిళా దినోత్సవ వేడుకల్లో పలువురు మహిళలను ఘనంగా సత్కరించారు. అనంతరం జరిగిన సమావేశంలో ఆమె మాట్లాడుతూ ప్రపంచంలోనే మహిళలకు మొదటి స్థానం ఇచ్చి గౌరవించే సంస్కృతి సంప్రదాయం కేవలం భారతదేశంలోనే ఉందన్నారు. ఇలాంటి దేశంలో ఉన్న మహిళలు మరింతగా అభివృద్ధి చెందాలంటే విద్యాపరంగా మరింతగా రాణించాల్సిన అవసరం ఉందన్నారు. మహిళలు సంపూర్ణ అక్షరాస్యత సాధించి అన్ని రంగాల్లో రాణించినప్పుడే సమాజం అభివృద్ధి చెందడానికి ఆస్కారం ఉంటుందన్నారు. దేశంలో ఇప్పటికే ఎందరో అత్యున్నత స్థానాలను అధిరోహించారన్నారు. ఒక మహిళ విద్యావంతురాలైతే ఆ కుటుంబం మొత్తం అభివృద్ధి చెందుతుందన్నారు. కార్యక్రమంలో తెలంగాణ సగర సంఘం రాష్ట్ర అధ్యక్షులు ఉప్పరి శేఖర్, జేఎన్‌టీయూ అసిస్టెంట్ ప్రొఫెసర్ అంజలి సగర, తెలంగాణ సగర సంఘం రాష్ట్ర గౌరవాధ్యక్షులు ముత్యాల హరికిషన్, తెలంగాణ మహిళా సగర సంఘం అధ్యక్షులు పెద్దబుద్దుల మహేశ్వరి, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి గాండ్లస్రవంతి, కోశాధికారి తంగడపల్లిపల్లవి, యువజన సంఘం రాష్ట్ర అధ్యక్షులు సతీష్, కార్యదర్శి మర్క సురేష్, కోశాధికారి రాము, నాయకులు సృజన తదితరులు పాల్గొన్నారు.

ఆకట్టుకున్న కూచిపూడి నృత్య ప్రదర్శన



కూచిపూడి నృత్యాంశాలు

మాదాపూర్: మాదాపూర్‌లోని శిల్పారామంలో శనివారం కూచిపూడి నృత్యప్రదర్శనతో కళాకారులు సందర్శకులను అలరించారు. వారాంతపు కార్యక్రమాల్లో భాగంగా నిరంజనా నాగరాజన్ శిష్య బృందం భామాకలాపం, క్షేత్రయ్య పదం, కలియనర్తన, తిల్లాన తదితర అంశాలను ప్రదర్శించారు. శ్రీహంస కూచిపూడి కళా నిలయం ప్రశాంతి శిష్య బృందం మూషిక వాహన, బ్రహ్మాంజలి, జనుత శబ్దం, పుష్పాంజలి, తదితర అంశాలను కళాకారులు శ్రావ్య, గ్రీష్మ, తేజస్విని, భవ్య, జోవిత, షాలిని, సాధ్విక, తన్వి, హిరణ్య తదితర అంశాలను ప్రదర్శించారు.

ఆలయాల అభివృద్ధికి సంపూర్ణ సహకారం

- పటాన్‌చెరు ఎమ్మెల్యే మహిపాల్‌రెడ్డి

జిన్నారం(పటాన్‌చెరు): గ్రామాల్లో ఆలయాల నిర్మాణాలకు సహకారం అందిస్తానని ఎమ్మెల్యే మహిపాల్‌రెడ్డి అన్నారు. గుమ్మడిదల మండలం, కానుకుంట గ్రామంలో నిరిస్తున్న ముత్యాలమ్మ తల్లి ఆలయ పనులకు శనివారం ఆయన శంకుస్థాపన చేశారు. అనంతరం మాట్లాడుతూ మారుమూల గ్రామాల్లో పురాతన ఆలయాలను అభివృద్ధి చేసేందుకు నిధులు కేటాయిస్తున్నామన్నారు. కార్యక్రమంలో ఎంపీపీ ప్రవీణ, జెడ్పీటీసీ సభ్యుడు కుమార్‌గౌడ్, నాయకులు హుస్సేన్, గోవర్ధన్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు. అనంతరం ఇటీవల గుండె ఆపరేషన్ చేయించుకున్న బీఆర్ఎస్ నేత ముద్రికాచారిని పరామర్శించి, ఆరోగ్య పరిస్థితిని తెలుసుకున్నారు.

టెక్నాలజీ ప్రొఫెషనల్స్‌కు డీప్‌టెక్ ఉపకార వేతనాలు

- టాలెంట్ స్ప్రింట్ సంస్థ వెల్లడి

రాయదుర్గం: టెక్నాలజీ ప్రొఫెషనల్స్ కోసం ట్రాన్స్‌ఫార్మేషనల్ డీప్‌టెక్ లెర్నింగ్ ప్రోగ్రామ్‌లను అందించే గ్లోబల్ ఎడ్‌టెక్ కంపెనీ అయిన టాలెంట్‌స్ప్రింట్ రూ. 3 కోట్ల విలువైన 500 స్కాలర్‌షిప్‌లను ప్రకటించినట్లు సంస్థ సీఈఓ, ఎండీ శంతనుపాల్ శనివారం తెలిపారు. 19 డొమైన్‌లు, స్పెషలైజేషన్ ప్రాంతాల్లో వీటిని అందించేందుకు ఏర్పాట్లు చేసిందన్నారు. వైవిధ్యాన్ని, ప్రతిభను ప్రోత్సహించేందుకు, ప్రతి ఒక్కరికీ అవకాశాలు కల్పించడమే టాలెంట్‌స్ప్రింట్ లక్ష్యమన్నారు. తమ కెరీర్‌ను పునఃప్రారంభించాలనుకుంటున్న మహిళలు, స్టార్టప్‌లు, డిఫెన్స్, అకాడమియా తదితర కేటగిరీల నిపుణులు, వికలాంగులకు ప్రత్యేక స్కాలర్‌షిప్‌ల ద్వారా అదనపు ఆర్థిక సహాయం అందించనున్నట్లు తెలిపారు. అర్హులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు.

మహిళలకు ఉచిత శిక్షణ



కార్యక్రమానికి హాజరైన మహిళలు

పటాన్‌చెరు: స్పోకెన్ ఇంగ్లిష్, కంప్యూటర్ కోర్స్, కుట్టు మిషన్‌పై మహిళలకు ఉచిత శిక్షణ ఇస్తున్నట్లు ఆర్జిన్ హై స్కూల్ ప్రిన్సిపాల్ అర్చన ప్రమోద్ తెలిపారు. శనివారం హై స్కూల్‌లో మహిళా దినోత్సవ వేడుకలు నిర్వహించారు. ఈ సందర్భంగా నిర్వహించిన పోటీల్లో ప్రతిభ చూపినవారికి బహుమతులు అందజేశారు. ఆర్థికంగా వెనుకబడిన మహిళలకు చేయూత అందించేందుకు ఏప్రిల్‌లో శిక్షణ ఇవ్వనున్నట్లు తెలిపారు. ఆసక్తిగల మహిళలు 8985550879 నంబర్‌లో సంప్రదించాలన్నారు.

అలరించిన స్వరార్చన



అన్నమయ్యపురంలో స్వరార్చన కార్యక్రమం

మాదాపూర్: మాదాపూర్‌లోని అన్నమయ్యపురంలో శనివారం సంకీర్తనలహరి నిర్వహించారు. శ్రీ పరదేశీ మ్యూజిక్ అకాడమికి చెందిన లహరినాథ్ శిష్య బృందంచే కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సవదర్భంగా కొండలలో నెలకొన్న, అమ్మ రావమ్మ, చక్కని తల్లికీ, గరుడగమన, సీతమ్మ మాయమ్మ అంటూ ఆలపించిన సంకీర్తనలు సందర్శకులను ఆకట్టుకున్నాయి. కళాకారులు ప్రియాంక, తేజస్వీ, శ్రీవాణి స్వరార్చన గావించి అలరించారు. అనంతరం కళాకారులను సన్మానించారు.

సమస్యల పరిష్కారానికి కృషి

- కార్పొరేటర్ మెట్టు కుమార్ యాదవ్

పటాన్‌చెరు టౌన్: డివిజన్‌లో సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని కార్పొరేటర్ మెట్టు కుమార్ యాదవ్ అన్నారు. శనివారం శ్రీరామ్ నగర్ కాలనీలో పర్యటించి, కాలనీ వాసులతో మాట్లాడారు. ఈ సందర్భంగా కాలనీలో డ్రైనేజీ సమస్య తీవ్రంగా ఉందని స్థానికులు ఆయన దృష్టికి తీసుకురావడంతో వెంటనే జీహెచ్ఎంసీ నుంచి డిసిల్టింగ్, ఎయిర్ టెక్ యంత్రాలను తెప్పించి మ్యాన్‌హోల్స్ శుభ్రం చేయించారు. అనంతరం గౌతమ్ నగర్ కాలనీలో పర్యటించి రూ.65 లక్షల వ్యయంతో చేపట్టిన సీసీ రోడ్డు పనులను పరిశీలించారు. పనులు నాణ్యతతో చేపట్టాలని సూచించారు. కార్యక్రమంలో కాలనీ వాసులు తదితరులు పాల్గొన్నారు.

ఆధునిక పద్ధతులను అందిపుచ్చుకోవాలి



టీఓఎస్ఏ వార్షిక సదస్సును ప్రారంభించిన డాక్టర్లు శ్రీనివాస్ కాసా, సోమశేఖర్‌రెడ్డి తదితరులు

మాదాపూర్: నైపుణ్యంతో కూడిన ప్రతిభకు ప్రాధాన్యం ఇవ్వాలని టోశకాన్ ఆర్గనైజింగ్ సెక్రటరీ డాక్టర్ శ్రీనివాస్ కాసా అన్నారు. మాదాపూర్‌లోని హెచ్ఐసీసీలో మూడు రోజుల పాటు కొనసాగనున్న తెలంగాణ ఆర్థోపెడిక్ సర్జన్స్ అసోసియేషన్(టీఓఎస్ఏ) వార్షిక సదస్సు శనివారం ప్రారంభమైంది. ఈ సందర్భంగా డాక్టర్ శ్రీనివాస్ కాసా మాట్లాడుతూ జీవితంలో ఏ దశలో చూసిన సమాజం శరవేగంగా అభివృద్ధి చెందుతుందన్నారు. దీంతో పాటు వైద్యశాస్త్రం కూడా అభివృద్ధి చెందుతుందన్నారు. లాక్‌డౌన్ సమయంలో చాలా మంది వైద్యులకు సరైన అవగాహన లేదన్నారు. సరికొత్త మందులు శస్త్ర చికిత్స పద్ధతులు అందుబాటులోకి వచ్చాయన్నారు. వాటిని వైద్యులు అందిపుచ్చుకోవాలని సూచించారు. మెడికల్ సర్జికల్ వస్తువులను ప్రదర్శించే 60 స్టాల్స్, మోకాలి ఆర్థోప్లాస్టీ , నాన్ యూనియన్ లాంగ్‌బోన్స్, మణికట్టు, చేతిగాయాలు, పాదం, చీలమండ గాయాలు వివిధ ప్రత్యేకతలతో 9 వర్క్‌షాప్‌లు నిర్వహించనున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో డాక్టర్ సోమశేఖర్‌రెడ్డి, డాక్టర్ జీవీఎస్ మూర్తి, డాక్టర్ రఘువీర్ రెడ్డి, డాక్టర్ విజయ్‌భాస్కర్, డాక్టర్ కృష్ణకిరణ్ తదితరులు పాల్గొన్నారు.